అత్తింటి వేధింపులు తాళ లేక వివాహిత ఆత్మహత్య

హాజీపూర్, మార్చి 6 : అత్తింటి వేధింపులు భరించలేక హాజీపూర్ మండలంలోని రాపల్లికి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ మండలం రాపల్లికి చెందిన మాడ లావణ్య అలియస్ ముస్కు రాణి (23)కు ఇదే గ్రామానికి చెందిన మాడ శంకర్‌రెడ్డితో వివాహం జరిగింది. అదనపు వరకట్నం కోసం అత్త, మామ, భర్త తరుచూ వేధిస్తుండేవారు. గతంలో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. కొన్నాళ్ల తర్వాత వారికి ఇద్దరు పిల్లలు పుట్టారు. అయినప్పటికీ వేధింపులు కొనసాగడంతో గత నెల 4న లావణ్య భర్త, మామ, అత్త పెట్టిన చిత్రహింసలు భరించలేక పురుగుల మందు తాగింది. మంచిర్యాలలోని మెడిలైఫ్ దవాఖానలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం పరిస్థితి విషమించి మృతి చెందిందన్నారు. మృతురాలికి శ్రీచరణ్ రెడ్డి (4),విక్కీ(రెండున్నర) సంవత్సరాల వయస్సుగల కుమారులున్నారు. మృతురాలి తండ్రి ముస్కు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఊరి వేసుకొని మహిళ ఆత్మహత్య

కనవేన రాజమణి (ఫైల్)

మంచిర్యాల అర్బన్, మార్చి 6: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోపాల్ వాడలో నివాసముంటున్న కనవేన రాజమణి (35) అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాల ప్రకారం రాజమణి కొన్ని రోజులుగా మానసికస్థితి సరిగాలేక బాధపడుతూ ఉండేది. వారం క్రితం మానసికంగా ఆందోళనగా ఉందని చెప్పగా సోదరుడు రఘువర్ధన్ వచ్చి ధైర్యం చెప్పివెళ్లాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి ఇంట్లో హాల్లోని సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకొని మృతి చెంది ఉందని పేర్కొన్నారు. మృతురాలి తమ్ముడు రఘువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. రాజమణికి భర్త సతీశ్, పిల్లలు సాయి కీర్తన, సాయి వినయ్ ఉన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన యువకులు

నెన్నెల, మార్చి 6: చెరువులో పడి తనువు చాలించాలనుకుని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని స్థానిక యువకులు కాపాడి అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నెన్నెల మండలం మైలారానికి చెందిన కొమ్ము రాజన్న ఇంట్లో గొడవ పెట్టుకుని బుధవారం సాయంత్రం ఇంటి నుంచి శ్రీరాంపూర్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి గురవారం ఉదయం ఆటోలో ఆవుడం వచ్చిన రాజన్న గంగారం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు చేరుకున్నాడు. నేరుగా అతను చెరువులో దూకగా సమీపంలో ఉన్న నలుగురు యువకులు చెరువులో దూకి నీటిలో మునిగి పోతున్న రాజన్నను బయటకు తీసుకువచ్చారు. వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించారు. ఎస్ఐ ప్రసాద్ సమక్షంలో రాజన్నతో పాటు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. రాజన్నను చెరువులో దూకి కాపాడిన సెగ్గం అంజన్న, సంతోష్, రాంటెంకి రాజేందర్, జాడి రాజ్‌కుమార్‌ను పోలీసులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్

మంచిర్యాల అర్బన్, మార్చి 6: మంచిర్యాలలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పరీక్ష అనంతరం పరీక్షా కేంద్రం నుంచి బయటకు వెళ్లే విద్యార్థినులపై వెకిలి చేష్టలు చేస్తున్న ఇద్దరు ఆకతాయిలను మంచిర్యాల షీ టీమ్ సిబ్బంది డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు ఎస్ఐ హైమా తెలిపారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

పత్తి రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్యం సిగ్గు చేటు

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చంద్రశేఖర్

చెన్నూర్, మార్చి 6: పత్తి రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి సిగ్గు చేటని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ అన్నారు. చెన్నూర్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నెముకలాంటి రైతు పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రైతుల కన్నీరు పెట్టాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులను అధికారుల అండదండలతో దళారులు విపరీతంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. చెన్నూర్ నియోజకవర్గంలో రైతులు తాము పండించిన పత్తిని విక్రయించేందుకు కన్నీళ్లు పెడుతున్నారని అన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఆయన కుమారుడు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పత్తి రైతుల ఆవేదనను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోని నాయకులు, అధికారుల తీరును ఉపేక్షించేది లేదన్నారు. దళారుల దోపిడీ నుంచి పత్తి రైతులను కాపాడే దిశగా తమ పార్టీ తరపున పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య, పట్టణ కార్యదర్శి సుంకరి చందు, నాయకులు సూత్రం నారాయణ, దుర్గం శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

లక్షెట్టిపేట, మార్చి 6 : కళాశాల విద్యా కమిషనర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పరిశోధన విలువలు పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు, గణితం విభాగాల విద్యార్థులు హైదరాబాద్ లోని ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ప్రతిభ కనబర్చారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహాత్మా సంతోష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహాత్మా సంతోష్ మాట్లాడుతూ తెలుగు ప్రాజెక్ట్‌కి అధ్యాపకుడు డా.తన్నీరు సురేశ్, గణిత ప్రాజెక్టుకు అధ్యాపకురాలు స్వప్న సూపర్‌వైజర్లుగా వ్యవహరించగా విద్యార్థులు శైలజ, విజయ్, తిరుపతమ్మ, లక్ష్మి, శ్రీనివాస్ తెలుగు, సాయి, వర్షిణి, రజినీ, లక్ష్మి, శ్రీనాథ్ గణితం ప్రాజెక్టులను ప్రజెంటేషన్ చేశారన్నారు. ఆధునిక సమాజం, మానవ జీవితంలో, పరిశోధనలో వస్తున్న మార్పులను పీపీటీ ద్వారా మోడల్స్ ప్రాజెక్టును ద్వారా యూనివర్సిటీ నుంచి వచ్చిన సెలక్షన్ కమిటీకి వివరించారని తెలిపారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా వచ్చిన జాయింట్ డైరెక్టర్ యాదగిరి విద్యార్థుల ప్రతిభను మెచ్చుకొని సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారన్నారు. జిజ్ఞాస కో ఆర్డినేటర్ జాడి శంకరయ్య, సూపర్ వైజర్లు డా. తన్నీరు సురేశ్, స్వప్న, బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

పరీక్షలంటే భయం వీడాలి

విద్యార్థులకు సూచనలు అందిస్తున్న మోటివేషనల్ స్పీకర్

దండేపల్లి, మార్చి 6: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని మోటివేషనల్ స్పీకర్ జయకృష్ణారెడ్డి అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎక్స్‌పర్ట్ టాక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై భయాన్ని జయించడం, ప్రణాళికతో చదవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నరేందుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండని ఎమ్మెల్యే వినోద్

- బెల్లంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అష్ఫల్

బెల్లంపల్లి, మార్చి 6 : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ బెల్లంపల్లి ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని బెల్లంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గురువారం మహమ్మద్ అష్ఫల్ సోషల్ మీడియాలో ఆరోపించడం బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ కలకలం సృష్టించింది. ఎమ్మెల్యే గడ్డం వినోద్ క్యాంపు కార్యాలయానికి రావడంలేదని, వీకెండ్ ఎమ్మెల్యేలాగా రావడం, తన చెంచాలను కలుసుకొని వెళ్తున్నారని ఆరోపించారు. సీనియర్ నాయకులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై బెల్లంపల్లి పట్టణంలో. గాని, మండలంలో గాని ఎలాంటి ప్రచారం చేయకపోవడం, పట్టభద్రులను కలవకపోవడం వల్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓటమి చెందారని ఆరోపించారు. భవిష్యత్తులో కూడా ఇలాగే వ్యవహరిస్తే పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు.

బేకరీని ప్రారంభించిన ఓసీసీ హెచ్ఆర్ జీఎం

బేకరీని ప్రారంభిస్తున్న హెచ్ఆర్ జీఎం

కాసిపేట, మార్చి 6 : కాసిపేట మండలంలోని దేవాపూర్ పరిశ్రమెంట్ కార్మికుడు బద్ది తిరుపతి, లత ఆధ్వర్యంలో చేపట్టిన స్టార్ బేకరీని గురువారం ప్రారంభించారు. ఓరియంట్ సిమెంట్ కంపెనీ హెచ్ఆర్ సీనియర్ జీఎం కులకర్ణి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి, ఓరియంట్ క్రిడిట్ సొసైటీ అధ్యక్షుడు అట్టెపల్లి శ్రీనివాస్, వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారి సంతోష్ రెడ్డి, వేజ్ బోర్డ్ వర్కర్ ప్రవీణ్ కుమార్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

మందమర్రి రూరల్, మార్చి 6: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్ఆర్ ఈజీఎస్‌పై సమీక్షా సమావేశం గురువారం ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పారిశుధ్య కార్యక్రమాలు, వంద రోజుల పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, తాగునీటిని అందించాలని సూచించారు. కార్యదర్శులు ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేయాలని, టాక్స్ కలెక్షన్ తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు సలహాలు సూచనలు చేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రజియా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యూనివర్సల్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (లి)
హెడ్ ఆఫీస్: మార్కెట్ రోడ్, మంచిర్యాల-504 208
ఫోన్: 08736-253537, 254856

47వ సర్వసభ్య సమావేశము నోటీసు

యూనివర్సల్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, మంచిర్యాల వారి 47వ సర్వసభ్య సమావేశము తేది: 24-03-2025 సోమవారం రోజున మ॥ 3.00 గం॥లకు మంచిర్యాల మార్కెట్ రోడ్డులోని బ్యాంకు స్వంత భవనము నందు జరుగును. కావున సభ్యులందరూ తమ గుర్తింపు కార్డు తీసుకొని సమావేశమునకు రావలసినదిగా కోరుచున్నాము.

-: ఎజెండా :-

1) 2024-2025 అర్ధ వార్షిక నివేదిక సమర్పణ
2) 30-09-2024 నాటి లాభనష్టాల ఖాతా, ఆస్తి అప్పుల పట్టిక (ఆడిట్ కానిది) ఆమోదించుట
3) 2024-2025 అర్ధ సంవత్సర ఆదాయ, వ్యయాలను ఆమోదించుట
4) 01-04-2025 నుండి 30-09-2025 వరకు బడ్జెట్ సమర్పణ
5) నూతనంగా చేరిన సభ్యుల బాబితా ఆమోదము
6) అధ్యక్షుల వారి అనుమతితో ఇతర అంశములు

గమనిక: పైన సూచించిన సమయమునకు "కోరమ్" పూర్తికానిచో నిరీక్షించి తిరిగి సాయంత్రం 4.00 గం॥లకు ఇదే స్థలంలో సమావేశము జరుగును.

తేది: 06-03-2025
స్థలం: మంచిర్యాల

ఇట్లు.. సం/- K.V.S.N. మూర్తి
I/C ముఖ్య కార్యనిర్వహణ అధికారి (I/C CEO)

కూరగాయల మార్కెట్ ఏర్పాటుచేయాలి

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి

మంచిర్యాలటౌన్, మార్చి 6 : మంచిర్యాల పట్టణంలో టూటౌన్ ప్రాంతంగా పిలువబడే హమాలీవాడలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తౌటం శివాజీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోగుల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సుమారుగా 15 వేలకు పైగా నివాసాలు టూటౌన్ ప్రాంతంలో ఉన్నాయని, వీరందరూ నిత్యం కూరగాయలు, ఇతర అవసరాలకోసం రైల్వే లైను అవతల ఉన్న వన్‌టౌన్‌కు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మరోవైపు హమాలీవాడ ప్రాంతంలో రోడ్లపైనే కూరగాయల వ్యాపారులు రోడ్లపైనే వారి వ్యాపారాలు సాగిస్తున్నారని, దీంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. హమాలీవాడ టూటౌన్ ప్రాంతంలో హమాలీవాడ, గోపాల్‌వాడ, వేములపల్లి, దొరగారిపల్లి, గాంధీనగర్, తిలక్‌నగర్, రాజీవ్‌నగర్, గీతామందిర్ ఏరియా, సూర్యానగర్, సున్నంబట్టివాడ, శ్రీశ్రీనగర్, సాయికుంట, తదితర ప్రాంతాలు ఉన్నాయని, ఇక్కడి ప్రజలు, వ్యాపారుల సౌకర్యార్థం కార్పొరేషన్ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీపతి వాసు, తాజుద్దీన్ , పడాల శ్రీనివాస్, పడాల రవీందర్, కర్రు శంకర్, శ్రీకాంత్, రాము, తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

- చెన్నూర్ ఏడీఏ బానోత్ ప్రసాద్

మందమర్రి రూరల్, మార్చి 6 : వరిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని చెన్నూర్ ఏడీఏ బానోత్ ప్రసాద్ అన్నారు. మందమర్రి మండలంలోని పొన్నారం, లేమూర్ గ్రామ శివారు వరి పొలాలను చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్, ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజుతో కలిసి పరిశీలించారు. వరి పొలాలు చిరు పొట్ట దశలో ఉండి అగ్గి తెగులు, కాండం తొలుచు పురుగు ఆశించినట్లు గుర్తించి, అగ్గి తెగులు ఆశించినప్పుడు గోధుమ ఎరుపు కలిగిన నూలు కండి ఆకారపు మచ్చలు ఏర్పడి క్రమేణ అవి కలిసిపోయి ఆకులు ఎండిపోతాయని, మెడ విరుపు కూడా వస్తుందని తెలిపారు. నివారణకు ట్రైసైక్లోజోల్ 75 డబ్ల్యూ.పీ 120 గ్రాములు, 50 గ్రాముల ప్లాంటుమైసిన్‌తో కలిపి పైరుపై పిచికారీ చేసుకోవాలని తెలిపారు, కాండం తొలచు పురుగు నివారణకు కార్తాప్ హైడ్రోక్లోరిడ్ 50 శాతం ఎస్‌పీ 250 నుంచి 400 గ్రాములు లేదా క్లోరాంతనిలిప్రోల్ 18.5 ఎస్‌సీ 60 మీ.లీ. ఎకరానికి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఆయ న వెంట రైతులు పెంచాల మధు, రంజిత్ తదితరులున్నారు.

విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి

మంచిర్యాల అర్బన్, మార్చి 6: ఇటీవల కొందరు వ్యక్తులు మీటరు తిరగకుండా చేస్తామని విద్యుత్ వినియోగదారులను మోసం చేస్తున్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ విజిలెన్స్ సీఐ ప్రభాకర్ తెలిపారు. మీటర్లు తిరగకుండా చేసి విద్యుత్ బిల్లు రాకుండా చేస్తామని మాయ మాటలు చెప్పి డబ్బులు తీసుకొని మీటర్లలోని వైర్లు కట్ చేసి మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలా చేస్తే విద్యుత్ శాఖా పరంగా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఇలా ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ, జేసీబీ సీజ్

సీజ్ చేసిన లారీ, జేసీబీ

జైపూర్, మార్చి 6: మండలంలోని కిష్టాపూర్ గోదావరి శివారు నుండి గురువారం ఉదయం అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..కిష్టాపూర్‌కు చెందిన జుమ్మిడి నాగరాజు గురువారం తెల్లవారు జామున ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి ఓచోట నిలువ చేసి శెట్‌పల్లికి చెందిన ధర్మాజీ సంతోష్ జేసీబీ సహాయంతో లారీని నింపుకుని హైదరాబాద్ తరలిస్తుండగా సిబ్బందితో కలిసి తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. లారీతో పాటు జేసీబీని సీజ్ చేశామని తెలిపారు. ఈ ఇసుక తరలింపులో జుమ్మిడి నాగరాజు, సయ్యద్ గౌస్, మహమ్మద్ రియాజ్, ధర్మాజీ సంతోష్, గాండ్ల మల్లయ్య, మహమ్మద్ సాదిక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మంచిర్యాల అర్బన్, మార్చి 6: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సున్నంబట్టి పై ఓవర్ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హాజీపూర్ మండలం ముల్కల్ల కు చెందిన శెట్టిపెల్లి నరేశ్‌కు తీవ్ర గాయాలైనట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాల ప్రకారం నరేశ్ పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా వారి సున్నంబట్టివాడలో కలెక్షన్ ఆఫీస్ నుంచి వైద్య కళాశాలకు తన మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. సున్నంబట్టి వైపు నుంచి మంచిర్యాల వైపునకు వస్తున్న లారీ అతి వేగంగా వెనక నుంచి వచ్చి నరేశ్‌ను ఢీకొట్టింది. నరేశ్ కుడి కాలు పూర్తిగా విరిగిందన్నారు. చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించగా కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు, నరేశ్ మామ దర్వాజ రాజయ్య లారీ డ్రైవర్ నర్సింహారెడ్డిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఇద్దరు నేరస్తులకు జరిమానా

మంచిర్యాల అర్బన్, మార్చి 6: అక్రమంగా భూమిలో ప్రవేశించి నిర్మించిన షెడ్డును ధ్వంసం చేసిన కేసులో నేరస్తులైన జాడి మల్లయ్య, జాడి రాజేశ్‌కు రూ.12వేల జరిమానాను జడ్జి డీ.ఉపనిషద్వని విధించినట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాలలోని జన్మభూమి నగర్‌కు చెందిన వంగపల్లి లక్ష్మణ్‌రావు 2004లో గర్మిళ్ల శివారులో 330 సర్వేనంబర్‌లోని 400ల చదరపు గజాల ఇంటి స్థలాన్ని షాదాన్నిసాబేగం వద్ద కొనుగోలు చేశారు. ఆ భూమిలో ఓ షెడ్డుని నిర్మించుకున్నాడు. 2015 మే 22న రామకృష్ణాపూర్‌కు చెందిన జాడి మల్లయ్య, జాడి రాజేశ్ వచ్చి ఫ్రంట్ బ్లేడ్ ట్రాక్టర్‌తో ఆ షెడ్డును కూల్చివేసినట్లు మంచిర్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. అప్పటి ఎస్ఐ లతీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. గురువారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్ కుమార్ నిందితులను కోర్టు లో హాజరుపరుచగా సాక్షులను విచారించి వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులకు ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు పింఛన్ పెంచాలి

- సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘం అధ్యక్షుడు లక్కర్సు ఆగయ్య

సీసీసీ నస్పూర్, మార్చి 6: చాలీ చాలని పింఛన్ డబ్బులతో సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెంటనే పింఛన్ పెంచాలని సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘం అధ్యక్షుడు లక్కర్సు ఆగయ్య డిమాండ్ చేశారు. కార్మికులు తమ చెమటను రక్తంలా మార్చి బొగ్గు ఉత్పత్తికి కృషి చేసి, రిటైర్డయిన తర్వాత కొందరికి రూ.500 నుంచి రూ.600 వరకు పింఛన్ వస్తుందని, మరికొంత మందికి రూ.2 వేల లోపు పింఛన్ వస్తుందన్నారు. ఏ ప్రభుత్వరంగ సంస్థలో ఇంత తక్కువ వచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రతి మూడేళ్లకోసారి పెంచాల్సి ఉన్నా యాజమాన్యం రూపాయి కూడా పెంచలేదన్నారు. పెన్షన్ల పెంపులేకపోవడంతో బతకడానికి కష్టమవుతుందని, రోగమస్తే తమకు చావులే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్లు తక్కువగా పొందుతున్న రిటైర్డ్ కార్మికులకు రూ.10 వేలు అందించేందుకు సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు నర్సింహారెడ్డి ప్రత్యేక చొరవతీసుకుని తమను ఆదుకోవాలని ఆయన కోరారు.

ఉపరితల గనుల్లో సౌకర్యాలు కల్పించాలి : టీబీజీకేఎస్

శ్రీరాంపూర్, మార్చి 6: వేసవికాలంలో ఎండలు మురురుతున్న నేపథ్యంలో సింగరేణి ఉపరితల గనులు, డిపార్ట్‌మెంట్ల కార్మికులకు తగిన సౌకర్యాలు కల్పించాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ వేసవి దృష్టిలో పెట్టుకుని ఓసీపీలు, సీహెచ్‌పీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల మొదటి బదిలీ, రెండవ బదిలీ పనివేళలు కుదించాలని, రెస్ట్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, పని ప్రదేశాల్లో వాటర్ స్ప్రెయింగ్ చేయించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని చల్లటి మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్‌లు అందించాలన్నారు. సెక్యూరిటీ సిబ్బందికి పని ప్రదేశాల్లో షెల్టర్లు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సింగరేణి ఉద్యోగినులకు ఆటల పోటీలు

టగ్ ఆఫ్ వార్ పోటీలను ప్రారంభిస్తున్న శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్

సీసీసీ నస్పూర్, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు ఉమారాణితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సర మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సింగరేణి ఉద్యోగినులు, ఉద్యోగుల భార్యలకు ఆటల పోటీలు నిర్వహించి, మహిళా దినోత్సవం రోజు శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో నిర్వహించే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు ఉద్యోగినులకు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం సమీపంలోని సెంట్రల్ నర్సరీలో బాంబ్ బ్లాస్ట్, టాగ్ ఆఫ్ వార్, త్రోబాల్ పోటీలను నిర్వహించగా, మహిళలంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్వోటూజీఎం శ్రీధర్‌రావు, గుర్తింపు సంఘం ఏఐటీయుసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఇన్‌చార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్, డీవైపీఎం రాజేశ్వర్‌రావు, సీనియర్ పీవో రణదీప్ గౌడ్, లా అధికారి ప్రబంధిత, ఇండోర్ కెప్టెన్ తోట సురేశ్, తదితరులున్నారు.

బెల్లంపల్లి ఏరియాలో..

రెబ్బెన, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం రాత్రి మహిళలకు ఆటల పోటీలు నిర్వహించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. త్రోబాల్, బాల్ ఇన్ బాస్కెట్, షాట్‌పుట్, లెమన్ అండ్ స్పూన్ ఆటలు పీఈటీ భాస్కర్ నిర్వహించారని, విజేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం 8న జరిగే కార్యక్రమంలో బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సీనియర్ సేవా సమితి సభ్యులు సొల్లు లక్ష్మి, కుందారపు శంకరమ్మ, మహిళలు పాల్గొన్నారు.

రెబ్బెన : బాల్ ఇన్ బాస్కెట్ పోటీలో పాల్గొన్న మహిళలు

చెస్ చాంపియన్ షిప్ పోటీలు

తాండూర్, మార్చి 6 : ఈ నెల 9వ తేదీ ఆదివారం కుమార్ బ్రదర్స్ చెస్ అ